సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



సోమశిలలో 8.472 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శనివారం నాటికి 8.472 టీఎంసీలు ఉన్నాయి. ఉత్తరకాలువకు 5, దక్షిణకాలువకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.76,050
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,811
3శాతం జీఎస్టీతో	రూ.7,015
నవర (8గ్రాములు)	రూ.56,120



వలంటీర్ల చేరిక

నెల్లూరు 15వ డివిజన్లో తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వలంటీర్లు.

న్యూస్‌రీల్

అసెంబ్లీకి తొమ్మిది నామినేషన్లు

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో మూడో రోజు శనివారం జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ స్థానాలకు మాత్రమే తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. కావలి 4, నెల్లూరు సిటీ 1, ఉదయగిరి 1, కోవూరు 1, కందుకూరు 2 చొప్పున నామినేషన్లు అందాయి.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



మర్రిపాడు: మండల టీడీపీ నాయకులు కోడ్‌ను ఉల్లంఘించారు. శనివారం మర్రిపాడులోని ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను జరిపారు. కోడ్ ఉల్లంఘనులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాకు ట్రైయినీ ఐపీఎస్‌లు

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలకు శిక్షణ ఐపీఎస్‌లను కేటాయిస్తూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. అందులో భాగంగా మయాంక్ మిశ్రా, పీకే సిద్దార్థ రామకుమార్, ప్రతీక్‌సింగ్, కుష్ మిశ్రా, సూరజ్, అభినవ్ ద్వివేది, జామాసోనార్, ఆషిమా వాశ్వాణి, అపర్ణ జిల్లాకు రానున్నారు.

కాకర్ల వైఖరిపై కస్సు బుస్సు

ఉదయగిరి టీడీపీలో అసమ్మతి భ్లోఅవుట్‌లా ఎగిసిపడుతోంది. ఆ పార్టీ అభ్యర్థి కాకర్ల సురేష్ పోకడలు నచ్చక సొంత పార్టీ నేతలే ఒక్కొక్కరుగా బయటకొచ్చేస్తున్నారు. మరికొందరు పార్టీలోనే ఉన్నా ఎన్నికల్లో సహకరించబోమని తెగేసి చెబుతున్నారు. మరోవైపు ప్యాకేజీ ఆకర్ష్‌తో వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన నాయకులు అవమానాలతో సొంతగూటికి తిరిగి చేరుకుంటున్నారు.

- ఉదయగిరి టీడీపీలో ఇదీ పరిస్థితి
- మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న బొల్లినేని
- తాజాగా సహకరించబోమని తెగేసి చెప్పిన ఆయన వర్గీయులు
- వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన వారికి అవమానాలు



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉదయగిరి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కాకర్ల సురేష్ డబ్బు మూటలతో అడ్డదారిలో టికెట్ దక్కించుకున్నారు. రాజకీయ నేపథ్యం..అనుభవం కానీ లేని ఆయన ఎన్‌ఆర్‌ఐగా టికెట్ రేస్‌లో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావుతో పోటీ పడ్డారు. చంద్రబాబు, లోకేశ్ తనను కాదని మరెవరికీ టికెట్ ఇవ్వరంటూ చెప్పుకున్న బొల్లినేని టికెట్ దక్కించుకోలేక భంగపడ్డారు. ఈ పరిణామంతో తీవ్ర అవమానానికి గురైన బొల్లినేని కొద్దిరోజులుగా రాజకీయ వ్యవహారాలకు దూరంగా ఉండిపోయారు. కాకర్లకు సహకరించాలని అధినేతలు చెప్పినా ససేమిరా అన్నారు. కాకర్ల సైతం బొల్లినేనిని సమన్వయం చేసుకోకపోగా, ఆయన చేస్తే ఎంత..చేయకపోతే ఎంత..అనే అహంకార ధోరణితో వ్యవహరిస్తున్నారు. బొల్లినేని వర్గీయులను దూరంగా పెట్టడంతో పాటు అడుగడుగునా అవమానిస్తున్నారు. కాకర్ల వ్యవహారశైలి నచ్చక బొల్లినేని వర్గీయులు టీడీపీ పదవులకు గుడ్‌బై చెప్పి బయటకొస్తున్నారు.

వికటించిన ప్యాకేజీ ఆకర్ష్

ఉదయగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేనికి బలమైన క్యాడర్ ఉంది. టికెట్ దక్కలేదనే బాధతో బొల్లినేని మౌనంగా ఉంటే..క్యాడర్‌ను సమన్వయం చేసుకోవడంలో కాకర్ల విఫలమయ్యారు. డబ్బు అహంకారంతో ప్యాకేజీలతో వైఎస్సార్‌సీపీ నేతలు కొందరిని ఆకర్షించి టీడీపీలో చేర్చుకున్నారు. కాకర్ల పోకడలు సదరు నేతలకు సైతం నచ్చక వెనువెంటనే తిరిగి సొంత గూటికి చేరుకుంటున్నారు. మరికొందరు లీడర్లను కాకర్ల సమక్షంలోనే టీడీపీ నాయకులు అవమానిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో ప్యాకేజీల ప్లాన్ వికటిస్తోంది. ఇటీవలే టీడీపీలో చేరిన ఉదయగిరి మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి రోజుల వ్యవధిలోనే తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. వరికుంటపాడు మండలం జడదేవికి చెందిన కామేపల్లి వెంకటరత్నం ఇటీవల టీడీపీలో చేరారు. ఆయన రాకను స్థానిక టీడీపీ నేత గుర్రం గోపి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల కాకర్ల జడదేవిలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో కామేపల్లి ప్రచార రథంపైకి ఎక్కి మాట్లాడేందుకు సిద్ధం కాగా గోపి చిందులు తొక్కాడు. కాకర్ల సమక్షంలో ఇదంతా జరిగినా మౌనం వహించారు. దీంతో తీవ్ర అవమానంగా భావించిన కామేపల్లితో పాటు వైస్ ఎంపీపీ దేవసబోయిన మధు ప్రచారం రథం దిగేసి మౌనంగా నిష్క్రమించారు. వారు వెళ్లిపోతున్నా కాకర్ల ఆపే ప్రయత్నం చేయలేదు. దీంతో టీడీపీలోకి వచ్చి చాలా తప్పు చేశామని వారు సన్నిహితుల వద్ద వాపోయినట్లు సమాచారం. ఈ పరిస్థితి ఎదురవుతుందని ముందుగానే గ్రహించిన టీడీపీలో చేరిన మరికొందరు నాయకులు బస్టాండ్ సెంటర్‌లోనే ఆగిపోయారు. కామేపల్లితో పాటు మధు పరిస్థితిని చూసిన వారు అక్కడి నుంచి అటే వెళ్లిపోయారు. ప్రస్తుతం మండలంలో ఇది హాట్ టాపిక్‌గా మారింది.

వైఎస్సార్‌సీపీలో 300 మంది చేరిక

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. శనివారం టీడీపీకి చెందిన 300 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ముఖ్యఅనుచరుడు వేలమూరి మహేశ్వరరెడ్డితో పాటు టీడీపీ నాయకులు ద్రోణాదుల రవీంద్రరెడ్డి, వాకా సుబ్బారెడ్డి, ద్రోణాదుల శంకరారెడ్డి, ద్రోణాదుల తిరుపాల్‌రెడ్డి, ద్రోణాదుల వెంకటేశ్వరరెడ్డి, ముచ్చాల మహేశ్వరరెడ్డి, చింతం వెంకారెడ్డి, సురి సుధాకర్‌రెడ్డి, పలకా శ్రీహరి రెడ్డి కుటుంబాలతో పాటు వారి బంధువులు, అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కాకర్లకు మరోషాక్

ఉదయగిరి నేత తిరిగి వైఎస్సార్‌సీపీలోకి వెళ్లిపోవడం, వరికుంటపాడు నేతలు సైతం అదే ఆలోచనతో ఉండగా, తాజాగా కలిగిరి మాజీ ఎంపీపీ రామిరెడ్డి, నేతలు రెండ్రోజుల క్రితం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భారీ సంఖ్యలో టీడీపీ శ్రేణులు వచ్చారు. కాకర్ల పోకడలను నిరసిస్తూ రానున్న ఎన్నికల్లో సహకరించేది లేదని తెగేసి షాక్ ఇచ్చారు. కొద్ది రోజుల క్రితం కొండాపురం టీడీపీ మండల కన్వీనర్ ఏకంగా పదవికే రాజీనామా చేసి బయటకొచ్చాడు. రాజీనామాకు ముందు రాత్రి వరకు కాకర్ల వెంటనే ఉన్న ఆయన తెల్లారేసరికి పార్టీని వీడడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. కాకర్ల పోకడలతో ఒక్కొక్కరు పార్టీని వీడుతుండడంతో టీడీపీ పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాకర్ల వ్యవహార శైలితో టీడీపీ శ్రేణులు, అభిమానులు సైతం పార్టీకి దూరమవుతున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ అభ్యర్థి కాకర్ల కనీసం పార్టీ శ్రేణులను సైతం ఆకర్షించలేకపోతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం నుంచి కాకర్ల రోజూ నిర్వహించే ప్రచార కార్యక్రమాలు అట్టర్‌ఫ్లాప్ అవుతున్నాయని స్థానికంగా ఉన్న నేతలు వాపోతున్నారు.

జనసేన ఉనికిని దెబ్బతీసింది చంద్రబాబే

- పార్టీ అధినాయకత్వం ఆయన ట్రాప్‌లో పడింది
- జనసేన జిల్లా అధ్యక్షుడిగా ఆరేళ్ల పాటు కష్టపడ్డా
- జిల్లాలో ఒక్క సీటూ ఇవ్వనప్పుడు పార్టీ మనుగడేంటి?
- విలువల్లేని పార్టీలో ఉండకూడదనే వైఎస్సార్‌సీపీలోకి
- వైఎస్సార్‌సీపీ నాయకుడు మనుక్రాంత్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మనుక్రాంత్‌రెడ్డి, పక్కన ఎంపీలు విజయసాయిరెడ్డి, ఆదాల, బీద, తదితరులు

నెల్లూరు(దర్గామిట్ట): 'జిల్లాలో జనసేన పార్టీ బలోపేతానికి గడిచిన ఆరేళ్లుగా నేను ఎంతో కృషి చేశా. 2018లో నేను జనసేన పార్టీలోకి అడుగుపెట్టినప్పుడు జిల్లాలో ఆ పార్టీకి అడ్రస్ లేదు. అప్పట్లో జనసేన మీటింగ్‌లు సైతం టీ దుకాణాలు, పార్కుల్లోనే జరిగేవి. అలాంటిది పార్టీలో చేరాక జిల్లా పార్టీ ఆఫీసు పెట్టి నెలకు రూ.లక్షల్లో ఖర్చు పెట్టి పార్టీ కార్యక్రమాలను నిర్వహించా. ఇవేమి తెలియని కొందరు ఇవాళ నేను పార్టీ మారానని కనీస ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు' అని జనసేనను వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మాగుంటలేవుట్‌లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీలు విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనుక్రాంత్‌రెడ్డి మాట్లాడుతూ జనసేన ఉనికిని జిల్లాలో చంద్రబాబే దెబ్బతీశారన్నారు. ఆయన ట్రాప్‌లో జనసేన నాయకత్వం పడిపోయిందన్నారు. జిల్లాలో ఒక్క సీటు ఇవ్వకపోతే నాతో పాటు ఆరేళ్లు కష్టపడి పనిచేసిన వారికి నేనేం సమాధానం చెప్పాలన్నారు. అందుకే విలువలు లేని చోట ఉండకూడదని మనస్తాపంతో జనసేనను విడిచి బయటకు రావాల్సి వచ్చిందన్నారు. 2014లో ప్రకటించిన మేనిఫెస్టోలోని హామీల్లో పది శాతాన్ని కూడా చంద్రబాబు అమలు చేయలేదన్నారు. చంద్రబాబు పచ్చి అవకాశవాది అని, అందితే జుట్టు, అందకపోతే కాళ్లు పట్టుకునే నైజం ఆయనదని, జిల్లా ప్రజలు ఆయన రాజకీయ శైలిని అర్థం చేసుకున్నారన్నారు. 2014 నుంచి 2019 వరకు ప్రతి టీడీపీ నాయకుడు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎగతాళి మాటలతో తీవ్రంగా అవమానించారని, వారికి మద్దతుగా ఇప్పుడు ఎలా పనిచేయగలమన్నారు. పవన్‌కళ్యాణ్ అభిమానులంతా చంద్రబాబుకు బుద్ధి చెప్పాలన్నారు. నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని, రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో జనసేన అధ్యక్షుడిగా పనిచేసిన మనుక్రాంత్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలోకి రావడం చాలా సంతోషకరమన్నారు. ఆయన్ని మనస్ఫూర్తిగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నామన్నారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి, ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ పట్టుదల కలిగిన నాయకుడు మనుక్రాంత్‌రెడ్డి జనసేన పార్టీలో నిస్వార్థంగా పనిచేశారని, ఆయన వైఎస్సార్‌సీపీలోకి రావడం సంతోషకరమన్నారు. ఆయనకు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ సముచిత స్థానాన్ని కల్పిస్తామని స్వయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. నారాయణ విద్యాసంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామని నిన్న 40 మంది వలంటీర్లతో రాజీనామాలు చేయించి టీడీపీలోకి చేర్చుకున్నారని తెలిపారు. వారంతా తిరిగి వైఎస్సార్‌సీపీలోకి వచ్చారంటే వారి మనస్సు అంతా తమ పార్టీ పైనే ఉందన్నారు. ముస్లింలు, క్రిస్టియన్ల మనోభావాలకు చంద్రబాబు వ్యతిరేకి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని బలపరిచామే తప్ప మేము మైనార్టీల మనోభావాల్ని దెబ్బతీసేలా ఎవరితోనూ జతకట్టలేదన్నారు. కామన్ సివిల్ కోడ్‌పై చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేర నియంత్రణే లక్ష్యం

- నగరాన్ని మూడు సెక్టార్లుగా విభజన
- ఇన్‌స్పెక్టర్లతో గస్తీ ముమ్మరం

నెల్లూరు(క్రైమ్): నేరాలను కట్టడిచేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేర నియంత్రణే లక్ష్యంగా రాత్రి గస్తీపై ప్రత్యేక దృష్టి సారించారు. నెల్లూరు నగరాన్ని మూడు సెక్టార్లుగా విభజించారు. ఒక్కో సెక్టార్‌కు ఇన్‌స్పెక్టర్‌స్థాయి అధికారిని నియమించి నిరంతరం గస్తీ నిర్వహించేలా చర్యలు చేపట్టారు. సదరు అధికారులు వారికి కేటాయించిన సెక్టార్లల్లో గస్తీని పర్యవేక్షిస్తూ దొంగతనాలు, అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోనున్నారు. అకారణంగా రాత్రి వేళల్లో తిరిగే ఆకతాయిలు, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకోనున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని వారి చిరునామా, వేలిముద్రలు, తదితర వివరాలను సేకరిస్తారు. వారి వేలిముద్రలను పోలీసు డేటాబేస్‌తో పరిశీలిస్తారు. అందులో ఎలాంటి నేరాలు లేన్నట్లు తేలితే వారి వివరాలను నమోదు చేసుకుని వదిలేస్తారు. రాత్రి గస్తీ సిబ్బంది స్టేషన్ పరిధిలో నేరచరిత్ర కలిగిన రౌడీషీటర్లు, సస్పెక్టెడ్‌లు, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచనున్నారు. ప్రతిరోజూ రాత్రి వారిని తనిఖీ చేసి సదరు వివరాలను బీట్‌బుక్‌లో నమోదు చేయనున్నారు. తాళం వేసిన ఇళ్లు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, లాడ్జిలు, ఆలయాలు, బ్యాంకులు, ఏటీఎంలు, ముఖ్యమైన కూడళ్లు, నిర్మానుష్య ప్రదేశాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధులు, చిన్నారులకు రక్షణ, అవసరమైన సాయం అందజేయనున్నారు.

ఏసీబీ వలలో తూ.కొ.శాఖ ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): వెరిఫికేషన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు లంచం తీసుకుంటుండగా తూనికలు, కొలతలు (లీగల్ మెట్రాలజీ) శాఖ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు శనివారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.38,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారులు, బాధితుల సమాచారం మేరకు..నగరానికి చెందిన వెంకటపతికి ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్ల ఏజెన్సీలు ఉన్నాయి. ఏటా వేయింగ్ మెషీన్లను తూనికలు,కొలతల శాఖ అధికారులు పరిశీలించి ధ్రువీకరణపత్రాలు జారీ చేస్తారు. స్టాంప్ డ్యూటీ సైతం కట్టిస్తుంటారు. ఈ నేపథ్యంలో వేయింగ్ మెషీన్లను పరిశీలించి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని వెంకటపతి తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ సాయిశ్రీకర్‌ను సంప్రదించగా, రూ.38,150 లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టంలేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ డీఎస్పీ శిరీషా సూచనల మేరకు వెంకటపతి టెక్కేమిట్టలోని తూనికలు,కొలతల శాఖ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌కు శనివారం లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గతంలో ఈ ఇదే తరహా చర్యలకు పాల్పడ్డారా అని అధికారులు, సిబ్బంది పాత్రపై ఏసీబీ అధికారులు ఆరాతీస్తున్నారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ శిరీషా, ఇన్‌స్పెక్టర్లు అంజనేయరెడ్డి, జీఎల్ శ్రీనివాసరావు, ఏసీబీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం అందజేస్తున్న విజయసాయిరెడ్డి, ఖలీల్ అహ్మద్, పర్వతరెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఆశీర్వదించాలని కోరుతూ..

ప్రచార పర్వం

నెల్లూరు నగరంలోని ఆరో డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, సిటీ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ప్రచారం చేశారు. ప్రజలందరికీ అండగా ఉంటామని భరోసా కల్పించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెంకటాచలం మండలంలోని రామదాసుకండ్రిగ, నాయుడుపాళెం, ఇడిమేపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. వైఎస్సార్‌సీపీ కావలి అసెంబ్లీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తూర్పు తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 31వ డివిజన్ శ్రీలంక కాలనీకి చెందిన 200 మంది అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతసాగరం మండలం చిలకలమర్రి గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరగా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కొడవలూరు మండలంలోని చింతచెలిక, తాటాకుల దిన్నె, పెమ్మారెడ్డిపాళెం, బొంతలపాళెం, పాతవంగల్లులో ముమ్మరంగా ప్రచారం చేశారు. కందుకూరు 16వ వార్డులోని ఖాజీపాళెంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

– నెల్లూరు ఫొటోగ్రాఫర్/వెంకటాచలం/కావలి/నెల్లూరు సిటీ, నెల్లూరు(దర్గామిట్ట)/కొడవలూరు/కందుకూరు



పార్టీలో చేరిన వారితో నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ఘన స్వాగతం పలికి తీసుకెళ్తున్న ప్రజలు



పెమ్మారెడ్డిపాళెంలో మాట్లాడుతున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



కరపత్రం అందజేస్తున్న కందుకూరు అభ్యర్థి మధుసూదన్ యాదవ్

రేపటి నుంచి టెక్నికల్ పరీక్షలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో డ్రాయింగ్, హ్యాండ్ లూమ్ వీవింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ, లోయర్ – హయ్యర్ గ్రేడ్ టైపింగ్ తదితర టెక్నికల్ కోర్సులకు సంబంధించిన పరీక్షలు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని ఆర్‌ఐఓ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే వారు హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వం నిర్దేశించిన గుర్తింపుకార్డుల్లో (ఆధార్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ లాంటివి) ఏదో ఒకటి పరీక్ష కేంద్రం వద్ద చూపించాల్సి ఉంటుందని తెలియజేశారు.

దోపిడీ కేసులో పురోగతి

- పోలీసుల అదుపులో నిందితులు

నెల్లూరు(క్రైమ్): మెమూ రైల్లో ప్రయాణికులపై దాడి చేసి సెల్‌ఫోన్, నగదు దోచుకెళ్లిన ఘటనలో నెల్లూరు రైల్వే పోలీసులు పురోగతి సాధించారు. దోపిడీకి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. సేకరించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.. విజయవాడ – గూడూరు మెమూ రైల్లో ఈనెల 17వ తేదీ తెల్లవారుజామున కోవూరు, పడుగుపాడు ప్రాంతాలకు చెందిన ముగ్గురు ఎక్కారు. కొండూరుసత్రం సమీపంలోకి రాగానే వారు ప్రయాణికులపై దాడి చేసి సెల్‌ఫోన్లు, నగదు దోచుకుని పరారయ్యారు. జాతీయ రహదారిపైకి చేరుకుని లారీలను ఆపి రాళ్లతో దాడికి దిగి దోపిడీకి యత్నించారు. దీనిపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే, మనుబోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దుండగులను అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా ఇద్దరు పారిపోగా కోవూరు ఇనుమడుగు సెంటర్‌కు చెందిన సాగర్‌ను పట్టుకున్నారు. రైల్వే పోలీసులు సాగర్‌ను విచారించగా మిగిలిన వారి వివరాలను వెల్లడించడంతో శనివారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆ ఇద్దరూ జువైనల్స్ అని సమాచారం. గతంలో నిందితులు పలు నేరాలకు పాల్పడినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.

నిమ్మ ధరలు (కిలో)	
పెద్దవి	రూ.75
సన్నవి	రూ.60
పండ్లు	రూ.26



రైస్‌మిల్లు వద్ద మృతదేహం

నెల్లూరు సిటీ: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన దాసరి రాము (56) అనే వ్యక్తికి ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కూతురు నెల్లూరులోని మూలాపేటలో నివాసం ఉంటోంది. ఆమె ఇంటికి రాము వచ్చాడు. శుక్రవారం ఉదయం చేపలు తీసుకొస్తానని ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రమైనా తండ్రి తిరిగి రాకపోవడంతో ఆమె ఫోన్ చేసింది. స్విచ్ఛాఫ్ చేసి ఉంది. స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నవబాలాదేవీ ఆలయ సమీపంలో రైస్‌మిల్లు వద్ద మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాముగా గుర్తించి కుటుంబసభ్యులకు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దిగి గల్లంతైన వ్యక్తి మృతి



కిశోర్ మృతదేహం

మనుబోలు: మండలంలోని వడ్లపూడి గ్రామంలో పశువులను అదిలించేందుకు చెరువులో దిగి గల్లంతైన కోసూరు కిశోర్ (30) అనే వ్యక్తి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. శనివారం వారు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన కిశోర్ పశువులను మేత కోసం శుక్రవారం పొలానికి తోలుకెళ్లాడు. చెరువులోకి గేదె దిగడంతో దాన్ని అదిలించేందుకు దిగాడు. అయితే లోతు ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్సై అజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించి గజ ఈతగాళ్లను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆచూకీ లభించలేదు. శనివారం కిశోర్ మృతదేహం చెరువులో నీటిపై తేలింది. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని చెముడుగుంట సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. అనికేపల్లి గ్రామానికి చెందిన నిరంజన్ బైక్‌పై నెల్లూరుకు బయలుదేరాడు. ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో నిరంజన్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం స్థానికులు 108 అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	141
లేయర్ (లైవ్)	98
బ్రాయిలర్ చికెన్	250
బ్రాయిలర్ స్కిన్‌లెస్	280
లేయర్ చికెన్	167

